

8లో

# కార్పొరేట్ కంపెనీలు గ్రామాలకు తరలండి

- ఒక్కో గ్రామాన్ని దత్తత తీసుకోవాలి
- పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క
- సంసిద్ధత వ్యక్తం చేసిన దిగ్గజ ఐటీ కంపెనీలు


వరంగల్ వాయిస్
Evening Daily
www.warangalvoice.net
వరంగల్ | సంపుటి : 03 | సంచిక : 345 | బుధవారం | 07 ఆగస్టు 2024 | పేజీలు : 08 | వెల రూ. 5


# గుర్రపు డెక్క తొలగించేదెప్పుడబ్బా..

- పచ్చని మైదానాలను తలపిస్తున్న చెరువులు
- తగ్గుతున్న నీటి నిల్వ సామర్థ్యం
- వేసవికాలం రాకముందే అడుగంటుతున్న జలాలు
- ఆక్రమణదారులకు అదునుగా మారుతున్న వైనం

వర్షాకాలంలో నీటితో నిండుగా కనిపించాల్సిన నగర చెరువులు పచ్చని మైదానాలుగా దర్శనమిస్తున్నాయి. చెరువుల్లో అధిక మొత్తంలో గుర్రపు డెక్క, తుంగ పెరిగిపోవడంతో వాటి ప్రాశాస్త్యాన్ని కోల్పోతున్నాయి. వీటితో అసలు చెరువుల మనుగడే ప్రశ్నార్థకంగా మారుతోంది. గ్రేటర్ పరిధిలోని చెరువులు, కుంటల్లో పేరుకుపోయిన గుర్రపుడెక్క, ఇతర వ్యర్థాలను తొలగించేందుకు పట్టణ ప్రగతి ద్వారా రూ.2 కోట్లతో జీడబ్ల్యూఎంసీ కొనుగోలు చేసిన ఫ్లోటింగ్ ట్రాష్ కలెక్టర్ అధికారుల అలసత్వంతో మూలకు పడింది. ఆక్రమణదారులతో చెరువుల విస్తీర్ణం రోజు రోజుకూ కుంచించుకుపోతుండగా గుర్రపు డెక్కతో చెరువుల్లో నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోతోంది. దీంతో వేసవి కాలం రాకముందే నగరంలోని చెరువులు అడుగంటుతున్నాయి. ఈ ప్రభావం నగరంలోని బోర్లు, బావులపై పడడంతో నగర వాసుల జీవనం అస్తవ్యస్తంగా మారుతోంది. అయితే నగరంలోని చెరువుల్లో పేరుకుపోయిన గుర్రపు డెక్కను తొలగించడంతోపాటు ఆక్రమణ దారులనుంచి వాటిని రక్షించాలంటూ సామాజిక కార్యకర్తలు పలువార్లు గ్రీవెన్స్ లో ఫిర్యాదు చేసినా పాలకులు, అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

- వరంగల్ వాయిస్, వరంగల్



వివరాలు 2లో..



# జడ్జీల సంఖ్య పెంచాలి

సుప్రీం కొత్త బెంచీలు ఏర్పాటు చేయాలి

**మాజీ ఎంపీ బి.వినోద్ కుమార్, బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి సోమ భరత్**

**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి చంద్రచూడ్ నిన్న చేసిన వ్యాఖ్యలపై మాజీ ఎంపీ బి.వినోద్ కుమార్, బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి సోమ భరత్ కుమార్ స్పందించారు. జడ్జిల బాధలు ఆ సీట్లలో కూర్చుంటే తెలుస్తాయని న్యాయమూర్తి చంద్రచూడ్ అనడాన్ని వారు గుర్తు చేశారు. సుప్రీం కోర్టు బెంచీలు దేశంలోని నాలుగు ప్రాంతాల్లో ఉండాలని ఎప్పట్నుంచో డిమాండ్ ఉంది. లా కమిషన్, పార్లమెంటు స్టాండింగ్ కమిటీ కూడా ఢిల్లీ, ముంబై , కలకత్తా, చెన్నై లేదా హైదరాబాద్ లో సుప్రీం కోర్టు బెంచ్ లు పెట్టాలని సూచించాయి.

మిగతా 2లో..

# చేనేతను ప్రోత్సహిద్దాం నేతన్నలను ఆదుకుందాం

వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్య శారదా




8లో..



8లో

# ప్రజలంతా సుభిక్షంగా ఉండాలి

మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్

ఘనంగా పోచమ్మ బోనాలు

# గుర్రపు డెక్క

## తొలగించేదెప్పుడబ్బా..



**పచ్చని మైదానాలను తలపిస్తున్న చెరువులు**

**తగ్గుతున్న నీటి నిల్వ సామర్థ్యం**

**వేసవికాలం రాకముందే అడుగంటుతున్న జలాలు**

**ఆక్రమణదారులకు అదునుగా మారుతున్న వైనం**

**వరంగల్ వాయిస్, వరంగల్ :** నగరంలోని అధిక శాతం చెరువుల్లో పచ్చదనం పరిచినట్లుగా గుర్రెపుడెక్క దర్శనమిస్తోంది. చెరువుల్లో నీటి శాతం తక్కువగా, గుర్రపెడెక్క శాతం ఎక్కువగా దర్శనమిస్తోంది. దీనికితోడు ప్యాస్టిక్ వ్యర్థాలు పెద్దఎత్తున పేరుకుపోవడంతో గ్రేటర్ పరిధిలోని చెరువులన్నీ తాంబాలాలను తలపిస్తున్నాయి. చిన్నపాటి చినుకులతే చెరువులు నిండిపోవడంతో పాటు మత్తడి దుముకుతున్నాయి. ఆరు నెలలు తిరక్కముందే అంటే వేసవి కాలం రాకముందే చెరువులన్నీ అడుగంటుతున్నాయి. నగరంలోని వేసవి జలాశయాల్లోకి నీటిని పెద్దఎత్తున పంపింగ్ చేయడంతో వాటిలో మాత్రమే వేసవి కాలంలో నీటి నిలువలు కనిపిస్తున్నాయి. భద్రకాళి బండ్, వడ్డేపల్లి బండ్, కాజీపేట బంధం చెరువు, ఉర్సు రంగ సముద్రం చెరువుల సుందరీకరణ, అభివృద్ధికి స్మార్ట్ సిటీ పథకంలో రూ.100 కోట్లు కేటాయించినా పనులు ఏళ్లు గడుస్తున్నా ఆగుతూ సా..గుతున్నాయి. దీంతో సుందరీకరణ దేవుడెరుగు అసలు చెరువులు మనుగడే ప్రశ్నార్థంగా మారే ప్రమాదం ఏర్పడింది.

### తగ్గుతున్న నీటి నిల్వలు..

నగరంలోని భద్రకాళి చెరువు, దేశాయిపేట చిన్నవడ్డేపెల్లి చెరువు, కాజీపేట బంధం చెరువు, హనుమకొండ వడ్డేపెల్లి చెరువు, ఉర్సు రంగసముద్రం, ములుగు రోడ్డు కోట చెరువు, గొర్రెకుంట కట్టమల్లన్న చెరువు, తిమ్మాపూర్ బెస్తం చెరువు, రంగశాయిపేట దామెర చెరువు, న్యూ శాయంపేట కోటి చెరువు, ఖిలావరంగ్ మాల అగర్తల చెరువులతోపాటు ఇతర చెరువుల్లో గుర్రపు డెక్క అధిక మొత్తంలో చేరడంతో నీటి నిల్వలు తగ్గిపోతున్నాయి. దీనికి తోడు పెద్ద మొత్తంలో వ్యర్థాలు చెరువులో చేరి దుర్వాసన వెదజల్లుతున్నాయి. చెరువుల పరిసరాల్లోకి వెళ్లాలంటేనే ముక్కు మూసుకునే పరిస్థితి నెలకొంది. అదే విధంగా ఈగలు, దోమలు చేరి పరిసరాల్లోని వారికి కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. వీటి భారిన పడిన అనేకులు అనారోగ్యంపాలైన ఆస్పత్రుల పాలవుతున్నారు. అయితే గుర్రపు డెక్కతో పాటు చెరువుల్లోని ఇతర వ్యర్థాలను తొలగించేందుకు పట్టణ ప్రగతిలో భాగంగా రూ.2 కోట్లు వెచ్చించి ఫ్లోటింగ్ ట్రాష్ కలెక్టర్ ను రెండు సంవత్సరాల క్రితం కొనుగోలు చేశారు. దీనిని ఉపయోగించి ఇంతవరకు నగరంలోకి ఒక్క చెరువులోని గుర్రపుడెక్కను కూడా తొలగించకపోవడం గమనార్హం. రెండు కోట్లు వెచ్చించినా రెండు లక్షల పని కూడా దాని ద్వారా చేయించలేదు. పాలకులు, అధికారుల నిర్లక్ష్యంతో ఎఫ్ టీసీ భద్రకాళి చెరువులో దిష్ఠి బొమ్మగా దర్శనమిస్తోంది.

### విచ్చల విడిగా ఆక్రమణలు..

వేసవి కాలం రాకుంటే చెరువుల్లోని నీరంతా అడుగంటడంతో ఆక్రమణ దారులకు అదునుగా మారుతోంది. అయితే రాజకీయ నాయకుల అండతో చెరువులనే లూటి చేస్తున్న కబ్జాకోరులు పెద్ద ఎత్తున ప్లాట్లు చేసి విక్రయిస్తున్నారు. వీటిని కొనుగోలు చేసిన ఎంతోమంది చెరువుల్లోకి నీరు వచ్చిన తర్వాత మోసపోయామన్న విషయం గుర్తు వస్తోంది. ఇట్లా లక్ష్యలు పెట్టి కొనుగోలు చేసిన ప్లాట్లు చెరువులకు సమర్పయామి అవుతున్నాయి.

### పలుమార్లు ఫిర్యాదు..

చెరువుల్లోని గుర్రపుడెక్కను తొలగించడంతోపాటు ఆక్రమణ దారులనుంచి వాటిని రక్షించాలంటూ ఆక్రమణ ఏరియాల సరిరక్షణ సొసైటీ అధ్యక్షుడు, సామాజిక వేత్త పెరుమాళ్ల లక్ష్మణ్ తోపాటు సిలివేరు నగేష్, పోతన వెంకటేశ్వర్లు, గణిపాక క్రాంతి పలుమార్లు బల్దియాలో జరిగిన గ్రీవెన్స్ లో ఫిర్యాదు చేశారు. చెరువుల్లోని వ్యర్థాలను తొలగించాలని, చెరువులను పూడిక తీసి నీటి నిలువ సామర్థ్యాన్ని పెంచాలని కోరారు. వివిధ వ్యాధులకు కారణమవుతున్న గుర్రపుడెక్క, తుంగపై బల్దియా అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. గ్రీవెన్స్ లో వచ్చే ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలంటూ ఒకవైపు ప్రభుత్వం ఆదేశిస్తున్నా చెరువుల పరిరక్షణ, గుర్రపుడెక్క తొలగించాలంటూ ఎనిమిది సార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా బల్దియా అధికారులు, పాలకవర్గం స్పందించి గుర్రపు డెక్కను తొలగించి నగర ప్రజల ఆరోగ్యాలను కాపాడాలని పెరుమాళ్ల లక్ష్మణ్ కోరుతున్నారు.





# జడ్జీల సంఖ్య పెంచాలి

**సుప్రీం కొత్త బెంచీలు ఏర్పాటు చేయాలి**

**మాజీ ఎంపీ బి.వినోద్ కుమార్, బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి సోమ భరత్**




**(మొదటి పేజీ తరువాయి.. )** కేంద్ర ప్రభుత్వం ఈ విషయంలో సానుకూలంగా ఉన్నా రాజ్యాంగం ఆర్టికల్ 130కే ప్రకారం సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తికే బెంచీలు ఏర్పాటు చేసే అధికారం ఉందన్నారు. నాలుగు చోట్ల సుప్రీం బెంచ్ లు ఏర్పాటు చేయడం దేశ సమగ్రతకు భంగం వాటిల్లుతుందని కొందరు అనవసర వాదన లేవనెత్తుతున్నారని మండి పడ్డారు. 2015లోనే ఎంపీగా సుప్రీం బెంచీల ఏర్పాటు ఆవశ్యకత ఉందని పార్లమెంటులో రాజ్యాంగ సవరణ బిల్లు ప్రతిపాదించానని బీఆర్ఎస్ నేత, మాజీ ఎంపీ బి.వినోద్ కుమార్ తెలిపారు. దేశంలో 5.1కోట్ల కేసులు పెండింగ్ లో ఉన్నాయని, 20 లక్షల కేసులు 30 ఏండ్లుగా కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. సుప్రీం కోర్టుకు 34 మంది జడ్జీలే ఉన్నారని 64 మంది ఉంటే తప్పేమిటని ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పుడు 24 మంది జడ్జిలే ఉండే వారు. కేసీఆర్ చొరవతో 2018లో 42 మంది జడ్జిలను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిందని గుర్తు చేశారు. ఇందులో అప్పటి సీజే ఎన్ వీ రమణ చొరవ కూడా ఉందన్నారు. ఏపీ హైకోర్టులో 37 మంది జడ్జిలే ఉన్నారు. ఇపుడు పార్లమెంటు సమావేశాలు నడుస్తున్నాయి కాబట్టి, సుప్రీం బెంచ్ లు నాలుగు చోట్ల ఏర్పాటు చేయడంతో పాటు సుప్రీం కోర్టు జడ్జీల సంఖ్యను 64కు పెంచడంపై చర్చ జరగాలని కోరారు. ఫుల్ కోర్టు న్యాయవాదులు సుప్రీం బెంచీల ఏర్పాటును రకరకాల కారణాలతో వ్యతిరేకిస్తున్నారన్నారు. ఫుల్ కోర్టు తన వైఖరి మార్చుకుని సుప్రీం బెంచీల ఏర్పాటు చేసేందుకు, జడ్జీల సంఖ్య పెంచేందుకు చొరవ చూపాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి సోమ భరత్ కుమార్ మాట్లాడుతూ ప్రపంచంలో భారత్ నాలుగో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా అతి పెద్ద ప్రజాస్వామ్య దేశంగా ఉందన్నారు. న్యాయ వ్యవస్థలో కేసుల పరిష్కారం వారీగా చూస్తే 142 దేశాల్లో 93వ స్థానంలో ఉందని తెలిపారు. సుప్రీం కోర్టు బెంచీల ఏర్పాటు విషయంలో ఫుల్ కోర్టు వాదన సమంజసంగా లేదని అభిప్రాయపడ్డారు. కేసులు పెండింగ్ లో ఉంటే అది దేశ జీడీపీపై ప్రభావం చూపుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయ వ్యవస్థకు కేంద్ర బడ్జెట్ లో 0.1 శాతం నిధులే కేటాయించారని మండిపడ్డారు. ఇది ఏ మూలకు సరిపోదని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హాయాంలో 33 జిల్లాలు ఏర్పాటు చేసి అంతటా కోర్టులు ఏర్పాటు చేసిందన్నారు. కోర్టులను కంప్యూటీరకరించిందన్నారు. ఇది చాలా రాష్ట్రాల్లో లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించి సుప్రీం కొత్త బెంచీల ఎర్పాటుకు కృషి చేయాలని, జడ్జీల సంఖ్య పెంచాలని వారు డిమాండ్ చేశారు.

# అధికారుల నిర్లక్ష్యం సహించం

## పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి



**వరంగల్ వాయిస్, సంగెం :** గ్రామాలలో డ్రైనేజీ, మంచినీటి సమస్య విద్యుత్ సమస్యల పరిష్కారంలో అధికారుల నిర్లక్ష్యం సహించనని అవసరమైతే శాఖాపరమైన చర్యలు తప్పవని పరకాల శాసనసభ్యుడు రేవూరి ప్రకాశ్ రెడ్డి హెచ్చరించారు. స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమంలో భాగంగా బుధవారం సంగెం మండలం వెంకటాపురం గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి పాల్గొని మొక్కలను నాటారు. గ్రామంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామంలో డ్రైనేజీ అస్తవ్యస్తంగా మారిందని, రోడ్లు గుంతలమయంగా ఉన్నాయని ప్రజలు ఫిర్యాదు చేయడంతో ఆయన అధికారులను వివరాలు అడిగి తెలుసుకొని అధికారుల నిర్లక్ష్యంపై మండిపడ్డారు. డ్రైనేజీ, మంచినీటి సమస్య విద్యుత్ సమస్యల పరిష్కారంలో అధికారుల నిర్లక్ష్యం సహించనన్నారు. వెంటనే పనులు చేపట్టి వారంలోగా సమస్యలు పరిష్కరించాలని లేకుంటే శాఖాపరమైన చర్యలు తప్పదని అధికారులను హెచ్చరించారు. ప్రజలు అధికారులు సామాజిక బాధ్యతతో కలిసి పనిచేస్తే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని అన్నారు. గ్రామస్థాయిలో ప్రతి ఇంట్లో కనీసం 6 మొక్కలు నాటాలని, ఉచితంగా మొక్కలు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు .ఓవర్ హెడ్ మంచినీటి ట్యాంకులను శుభ్రపరచాలని, క్లోరోస్కోప్ ద్వారా త్రాగునీటి పరీక్షలు చేసి నాణ్యమైన త్రాగునీరు అందించాలని ఆదేశించారు. స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమం కేవలం 5 రోజులే కాకుండా నిరంతరం కొనసాగే విధంగా అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు అందరూ సమిష్టిగా బాధ్యతతో పని చేసినప్పుడు ఈ కార్యక్రమం విజయవంతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## మూడో రోజుకు స్వచ్ఛదనం-పచ్చదనం



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** నగరంలోని 20వ డివిజన్ కాశిబుగ్గలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్వచ్ఛదనం-పచ్చదనం అనే కార్యక్రమాన్ని దేవదాయ శాఖ మంత్రి కొండా సురేఖ మురళీధర్ ఆదేశానుసారం మూడో రోజులో భాగంగా పరిసరాల పరిశుభ్రత కోసం వీధి వీధి తిరుగుతూ నాళాలు, డ్రైనేజీలను కార్పొరేటర్ గుండేటి నరేందర్ కుమార్ దగ్గరుండి పరిశీలించారు. మోరీలలో పేరుకుపోయిన శిల్టును మున్సిపల్ సిబ్బందితో తీయించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ ఆర్ఐ సోహెల్, వార్డు ఆఫీసర్ సందీప్, ఆర్పీలు, అంగన్వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు, స్థానిక నాయకులు, డివిజన్ అధ్యక్షుడు కుసుమ సతీష్, తోట బాలరాజు, జన్ను వేణు, ఎండీ ఫయాజ్, పెండ్యాల స్వరాజ్, చిరంజీవి శివ, బిట్టు, మగబుల్ ప్రకాష్, పెండ్యాల కొమురయ్య, ఏకెల్లి దేవరాజ్, శ్రీకాంత్, యాకుబ్, జవాన్, బుట్టి బాబు పాల్గొన్నారు.

## తాగునీటిపై అవగాహన సదస్సు




**వరంగల్ వాయిస్, వరంగల్ :** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా బుధవారం అటవీ పర్యాటక పర్యావరణ దేవాదాయ ధర్మదాయ శాఖ మంత్రి కొండా సురేఖ మురళీధర్ రావు ఆదేశాల మేరకు స్థానిక కార్పొరేటర్ పల్లం పద్మ రవి ఆధ్వర్యంలో మంచినీటి అవగాహన సదస్సు నిర్వహించారు. డోర్ టు డోర్ వెళ్లి వాటర్ ను చెక్ చేసి ఏ విధంగా ఉంటే బాగుంటుందో ప్రజలకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ లోని ఆర్పీలు, అంగన్వాడీ టీచర్స్, ఆశ వర్కర్లు, స్పెషల్ ఆఫీసర్, ఏఈ, ఎలక్ట్రిక్ డిపార్ట్మెంట్ మున్సిపాలిటీ, జవాన్ జీవన్ కుమార్, అర్బన్ మలేరియా సిబ్బంది, ఇంజనీరింగ్ సెక్షన్,లైన్మెన్ సాంబయ్య మరియు డివిజన్లోని ముఖ్య మహిళా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఉద్యోగార్థులకు ఉచిత స్టడీ రూమ్

## ఉపాధ్యాయ దంపతుల ఉదారత



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ప్రభుత్వ ఉద్యోగ నియామక ప్రకటనతో ఉద్యోగ సాధన కోసం శ్రమిస్తున్న ఉద్యోగార్థుల సౌకర్యార్థం ఉచిత స్టడీ రూమ్ ను ఏర్పాటు చేసి జాతీయ అవార్డు గ్రహీత పరికిపండ్ల వేణు, రాష్ట్ర అవార్డు గ్రహీత వెలుదండి సుమలతలు తమ ఔదార్యాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు గ్రంథాలయాలు నిరుద్యోగులతో కిటకిటలాడుతున్నాయి. తాజాగా ప్రభుత్వం జాబ్ క్యాలెండర్ ప్రకటించడంతో ఆ సంఖ్య మరింత పెరుగనుంది. ఇంటి వద్ద చదువుకోవడానికి వీలులేని బడుగు బలహీన వర్గాల నిరుద్యోగులు, ప్రైవేట్ స్టడీ రూముల్లో డబ్బులు చెల్లించి చదువుకోలేని వారు ఏ చెట్ల కిందనో ఎండకు, వానకు గురవుతూ చదువుకోవాల్సి వస్తుంది. కాబట్టి, అలాంటి వారి కోసం ఈ ఉచిత స్టడీ రూమ్ ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. హనుమకొండలోని 53వ




డివిజన్ ఆదర్శ కాలనీలో గత దశాబ్ద కాలంగా అనేక సామాజిక సేవా కార్యక్రమాలకు నిలయంగా ఉన్న అభి నిలయంలో కాలనీ సమావేశాలు, శాస్త్ర మిత్ర స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో ప్రతినెల రెండవ శనివారం కరెంట్ అఫైర్స్ మీద థింక్ తాట్ చర్చలు, జన విజ్ఞాన వేదిక, ఇగ్నైటెడ్ మైండ్స్ ఫ్యామిలీ అసోసియేషన్, పెన్షనర్స్ యూనియన్ సమావేశాలు, మహిళా చైతన్య వేదిక "సఖి" సమావేశాలు, నేత్ర శరీర అవయవదానంపై అవగాహన కార్యక్రమాలు జరుగుతాయి. పరికిపండ్ల నరహరి ఐఏఎస్ స్థాపించిన ఆలయ ఫౌండేషన్ వారి సౌజన్యంతో పుస్తకాలు, కుర్చీలు, టేబుళ్లు, ఫ్యాన్ లు, మంచి నీటి వసతితో ఉచిత స్టడీ రూమ్ ను ఏర్పాటు చేయడం జరిగింది. కాబట్టి, బడుగు బలహీన వర్గాలకు చెందిన ఉద్యోగార్థులు ఈ సదవకాశాన్ని వినియోగించుకొని కొలువులు సంపాదించుకొని జీవితంలో స్థిరపడాలని కోరారు. చదువుకోవడానికి వచ్చే వారు 9490133650 ఫోన్ నెంబర్ లో సంప్రదించవలసిందిగా తెలిపారు.

## విద్యార్థుల విషయంలో జాగ్రత్తగా ఉండాలి

### ఎమ్మెల్యే భూక్య మురళినాయక్



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** మున్సిపాలిటీ పరిధిలోని ఎన్టీఆర్ స్టేడియం ప్రాంగణంలోని సోషల్ వెల్ఫేర్ స్కూల్ లో డార్మింటరీ ఓపెనింగ్ బాల బాలికల వసతి భవన నిర్మాణం కార్యక్రమంలో షీలా ఫలకాన్ని మహబూబాబాద్ శాసనసభ్యుడు డాక్టర్ భూక్య మురళినాయక్ ప్రారంభించారు. ఎమ్మెల్యే స్కూల్లోనే పలు తరగతి గదులను హాస్టల్లో ఉండే వసతులను పర్యవేక్షించారు. అలాగే, విద్యార్థులను అక్కడున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అక్కడున్న కాలేజీ యజమాన్యంతో పిల్లలపైన ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ఏ విషయంలో అయినా అజాగ్రత్త పాటించవద్దని, పిల్లలను వారి సొంత పిల్లల లాగా చూసుకోవాలని స్కూల్ యజమాన్యానికి, ప్రిన్సిపాల్‌కు సూచించారు. విద్యార్థుల పట్ల చాలా జాగ్రత్తగా ఉండాలన్నారు. ఎప్పటికప్పుడు పిల్లల ఆరోగ్య, ఆహార, చదువు విషయాల్లో శ్రద్ధ వహించాలన్నారు. ఈ హాస్టల్లో విద్యార్థులకు ఎలాంటి సమస్యలు ఉన్న తక్షణమే నా దృష్టికి తీసుకురావాలన్నారు. సమస్యలపై వెంటనే చొరవ చూపుతానని తెలియజేశారు. వారికి ఎలాంటి ఆపదొచ్చినా వెన్నంటే నేనుంటానని భరోసా ఇచ్చారు. టెన్త్ క్లాస్ విద్యార్థులు 10/10 తెచ్చుకున్న వారికి ప్రత్యేకంగా బహుమతులను అందజేస్తానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ పట్టణ అధ్యక్షుడు, పలు వార్డుల కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ పట్టణ సీనియర్ నాయకులు, వార్డుల, యూత్ నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్ట్స్ కాలేజీలో మండల్ డే



**వరంగల్ వాయిస్, సుబేదారి :** ఇతర వెనుకబడిన తరగతులకు కేంద్ర విద్యా, ఉద్యోగాలలో 27 శాతం రిజర్వేషన్లను పార్లమెంటులో నాటి ప్రధాని విశ్వనాథ్ ప్రతాప్ సింగ్ ప్రకటించిన ఆగస్టు 7ని మండల్ డే గా జరుపుకుంటున్నామని బీసీ జాక్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ తిరునారి శేషు తెలిపారు. బుధవారం మండల్ డే సందర్భంగా యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో బీపీ మండల్ కు నివాళులర్పించిన సందర్భంగా డాక్టర్ శేషు మాట్లాడుతూ మండల కమిషన్ నివేదిక వలనే దేశంలో ఉన్న 57 శాతం వెనుకబడిన తరగతులకు 27 శాతం రిజర్వేషన్లు అందుతున్నాయని అభిప్రాయపడ్డారు. మండల్ కమిషన్ రిపోర్ట్ ప్రకారంగా వెనకబడిన తరగతులకు 27శాతం రిజర్వేషన్లు కల్పించాలి కానీ, ఇప్పటికీ కేంద్ర విద్యా ఉద్యోగాలలో 11 శాతం రిజర్వేషన్లు కూడా వెనుకబడిన తరగతులు పొందలేకపోతున్నారు. వెనకబడిన తరగతుల సమగ్రాభివృద్ధి కోసం మండల్ తన కమిషన్ రిపోర్ట్ లో 40 సిఫారసులు చేస్తే ప్రభుత్వాలు కేవలం రెండు సిఫారసులను మాత్రమే అమలు చేస్తున్నాయన్నారు. కేయూ జంక్షన్ లో మండల విగ్రహాన్ని ఏర్పాటు చేయటానికి జిల్లా అధికార యంత్రాంగాన్ని అనుమతి కోరుతామని తెలియజేశారు.

# ఎన్నికల హామీలను రాష్ట్ర ప్రభుత్వం నెరవేర్చాలి

## ఏఐఎఫ్‌డీడబ్ల్యూ జిల్లా కన్వీనర్ మాస్ సావిత్రి

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీ అమలుపరచాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సమాఖ్య (ఏఐఎఫ్ డీడబ్ల్యూ) హనుమకొండ జిల్లా కన్వీనర్ మాస్ సావిత్రి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సమాఖ్య తెలంగాణ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా హనుమకొండ మండల తహసీల్దార్ విజయ్ కుమార్ కు మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా మాస్ సావిత్రి మాట్లాడుతూ కేసీఆర్ ఇస్తున్న పింఛన్ పెరిగిన ధరలకు ఖర్చులకు ఏమాత్రం సరిపోవు కొర్రీలు పెట్టి ఇంట్లో ఒక్కరికే పింఛన్ ఇస్తున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఒక ఇంట్లో ఇద్దరికీ పింఛన్ ఇస్తామని, అదేవిధంగా రూ.4000లకు పెంచి పింఛన్ ఇస్తామని ఆటహాసంగా, ఆర్భాటంగా ప్రచారం చేసి ఓట్లు దండుకున్నారు. అదేవిధంగా వికలాంగులకు రూ.6000 పింఛన్ ఇస్తానని చెప్పి దానిని చేయూతగా పథకమని మార్చారు. కానీ, ఇంతవరకు పెంచి ఇవ్వలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నోట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ ప్రవేశపెట్టారు. వర్షాకాల శాసనసభ సమావేశాలలో పూర్తి బడ్జెట్ ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీల పథకాలను అరకొరగా విడుదల చేస్తున్నారు. తక్షణమే



అర్హులైన అందరికీ పింఛన్ అందించేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గ్రామీణ ప్రాంతాలలో పట్టణ ప్రాంతాలలో బెల్ట్ షాపు లేకుండా చేస్తానని చెప్పిన సీఎం రేవంత్ రెడ్డి ఆ విషయాన్ని పెడచెవిన పెట్టారు. తక్షణమే బెల్టు షాపులు మూసివేసి మద్యపాన నిషేధాన్ని అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ మహిళా సంఘం కమిటీ సభ్యులు ఎన్ రెడ్డి రాజేంద్ర, గడ్డం సుధారాణి, బండారి మమత తదితరులు పాల్గొన్నారు.

# చేనేత రంగాన్ని ఆదుకోవాలి

## అఖిల భారత పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు ఆనందం



**వరంగల్ వాయిస్, హసన్‌పర్తి :** ప్రభుత్వాలు, పాలకులు చేనేత రంగంపై చిన్నచూపు చూస్తూ వివక్ష చూపుతున్నాయని, రాష్ట్రంలోని చేనేత సంఘాల బలోపేతానికి కాంగ్రెస్ సర్కార్ నడుం బిగించాలని అఖిల భారత పద్మశాలి సంఘం హనుమకొండ జిల్లా అధ్యక్షుడు బచ్చు ఆనందం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ప్రపంచ చేనేత దినోత్సవం పురస్కరించుకొని హసన్ పర్తి చేనేత సహకార ఉత్పత్తి విక్రయ సంఘంలో వేడుకలను నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు బచ్చు ఆనందం కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాలవేసి వేడుకలను ప్రారంభించారు. అనంతరం సీనియర్ చేనేత కార్మికులను ఘనంగా శాలువాతో సన్మానించి పండ్లను పంపిణీ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం చేనేత రంగం మరింత అభివృద్ధి పథంలో ముందుకు సాగాలంటే ప్రత్యేక నిధులు కేటాయించి ఆదుకోవాల్సిన అవసరం ఉందన్నారు. చేనేత సంఘాల్లో సరైన పనులు లేక కార్మికులు పస్తులు ఉండాల్సిన పరిస్థితి నెలకొందని తెలిపారు. మరి కొంతమంది కార్మికులు చేసేందుకు పని లేక కూలీలుగా మారుతుండగా ఇంకొంతమంది ఆర్థిక ఊబిలో కూరుకుపోయి ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ప్రభుత్వానికి గుర్తు చేశారు. చేనేత కార్మికుల ఆత్మహత్యల నివారణకు సంక్షేమ పథకాలను అమలు చేసి రైతులకు రుణమాఫీ చేసినట్లే చేనేత కార్మికులకు పద్మశాలిలకు, రుణాలు అందజేయాలని కోరారు. చేనేత పనిచేసి ఎముకల గూళ్లగా మారుతున్న కార్మికులకు ప్రత్యేక వైద్య చికిత్స అందించాలని సూచించారు. అలాగే కమలాపూర్ మండల కేంద్రంలో చేనేత కార్మికులు చేనేత దినోత్సవం పురస్కరించుకొని ప్రధాన రహదారి వెంట ర్యాలీ నిర్వహించి నినదించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు వైద్యం రాజ్ గోపాల్, జిల్లా ప్రధాన కార్యదర్శి కేదాసి వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు వెంగళ వేణుగోపాల్, కార్యదర్శి సట్యూరి సంతోష్, ప్రచార కార్యదర్శి పులికంటి రాజేందర్, హసన్‌పర్తి పద్మశాలి సంఘం అధ్యక్షుడు కేదాసి రాకేష్, హనుమాన్ల విద్యాసాగర్, భాస్కర్, భిక్షపతి, కుమారస్వామి, కార్మికులు పాల్గొన్నారు.

## చేనేతపై జీఎస్టీ రద్దు చేయాలి

### సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు వెంకట్రాములు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** కేంద్ర ప్రభుత్వం చేనేతపై జీఎస్టీ రద్దు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం చేనేత బంధు ప్రకటించాలని తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు డిమాండ్ చేశారు. బుధవారం జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా కొత్తవాడలో జరిగిన కార్యక్రమానికి కూచన సారయ్య అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా పాల్గొన్న వెంకట్రాములు ప్రసంగిస్తూ ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన మన చేనేత పరిశ్రమ పాలకుల నిర్లక్ష్యంతో సంక్షోభానికి గురై పనులు లేక నేతన్నలు ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యలపాలౌతున్న పట్టించుకోని పాలకులు బడా పారిశ్రామిక వేత్తలకు ఊడిగం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యవసాయం తర్వాత అత్యధిక మందికి ఉపాధి కల్పించే చేనేతకు నిధులు కేటాయించక చేనేతను నిర్వీర్యం చేస్తున్నారన్నారు. ఆగస్టు7న జాతీయ చేనేత దినోత్సవం జరిపితేనే సరిపోదని చేనేతపై ఏమాత్రం ప్రేమ ఉన్న తక్షణమే జీఎస్టీ రద్దు చేయాలన్నారు. రాష్ట్రప్రభుత్వం నేతన్నలు నేసిన వస్త్రాలన్నింటిని కొనుగోలు చేయాలని, చేనేత రుణాలు మాఫీ చేయాలని, ప్రతి కార్మికునికి చేతి నిండా పనులు కలిగించి నెలకు రూ.16 వేలు లభించేలా చూడాలని, చేనేత మిత్ర, చేనేతకు చేయూత పథకాలు కొనసాగించాలని, బీమాసౌకర్యాన్ని 75 సంవత్సరాల వరకు అమలుపరచాలని, ఆత్మహత్యల పాలైన కుటుంబాలకు రూ.20 లక్షలు ఎక్స్ గ్రేషియో చెల్లించాలని డిమాండ్ చేశారు. చేనేత పరిరక్షణకు సమస్యల పరిష్కారానికి పోరాటాలకు సిద్ధం కావాలని వెంకట్రాములు పిలుపునిచ్చారు. లింగబత్తిని రామకృష్ణ, శంకర్, సారయ్య, గుండా రమేష్, బాసబత్తిని శంకరయ్య, బొద్దుల భిక్షపతి, వల్లాలకిషోర్, ఈగ మొగిలయ్య, దూడంపెద్దులు తదితరులు పాల్గొన్నారు.

## నేత కార్మికుడు ఆడెపు భిక్షపతికి సన్మానం



**వరంగల్ వాయిస్, మొగిలిచెర్ల :** గ్రేటర్ వరగంల్ మున్సినల్ కార్పొరేషన్ పరిధిలోని 15 వడివిజన్ మొగిలిచెర్ల గ్రామానికి చెందిన సీనియర్ నేత కార్మికుడు ఆడెపు భిక్షపతిని వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారదా సన్మానించారు. బుధవారం జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ ఆడెపు భిక్షపతికి మెమొంటో ఇచ్చి, శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. చేనేత కార్మికుడిగా గత 60 ఏళ్ళుగా సేవలు అందిస్తున్న సందర్భంగా ఆయకు ఈ సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు, చేనేత కార్మికులు పాల్గొన్నారు.

## మరమగ్గాల కార్మికులకు ఉపాధి కల్పించాలి



**వరంగల్ వాయిస్, పాలకుర్తి :** జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా పాలకుర్తి మండల పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో పాలకుర్తిలోని గుడివాడ చౌరస్తా నుంచి రాజీవ్ చౌరస్తా వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పద్మశాలి సంఘం అధ్యక్షుడు మాచర్ల సారయ్య, తెలంగాణ పద్మశాలి విద్యార్థి సంఘం అధ్యక్షుడు డాక్టర్ మేడారపు సుధాకర్, కోశాధికారి కూరపాటి సుదర్శన్ మాట్లాడుతూ గతంలో తెలంగాణలోని పద్మశాలి చేనేత, మరమగ్గాల కార్మికులకు సంబంధించిన త్రిఫ్ట్ ఫండ్ ను కొనసాగించాలని, సహకార సంఘాలకు ఎన్నికలు జరిపించాలని, మరమగ్గాల కార్మికులకు బతుకమ్మ చీరల స్థానంలో ఉపాధి కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఈనెల ఆగస్టు 18న జరుగబోయే తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం అధ్యక్షుడి ప్రత్యక్ష ఎన్నికలకు మండలంలోని పద్మశాలి కుల భాంధవులు సిద్ధంగా ఉండాలని అన్నారు. రాబోయే నవంబర్ 5న తెలంగాణ రాష్ట్ర రైతాంగ పోరాట యోధుడు నల్ల నరసింహులు విగ్రహ ప్రతిష్టాపన చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ ర్యాలీలో పాలకుర్తి మండల పద్మశాలి సంఘం పూర్వ అధ్యక్షుడు దేవసాని కృపాకర్, మండల సంఘం కార్యదర్శి పెనుగొండ రమేష్, తొర్రూరు పూర్వ ఎంపీటీసీ చిదురాల ధనుంజయ, పాలకుర్తి మండల కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి భైరు భార్గవ్, రాపోలు తిరుపతి, శ్రీరామ్ సుధాకర్, పెనుగొండ కిష్టయ్య, వొల్లాల సోమనారాయణ, బిర్రు సోమేశ్వర్, పాలకుర్తి పట్టణ అధ్యక్షుడు చిలుకమారి వెంటేశ్వర్లు,పెనుగొండ వెంకటేశ్వర్లు, చిదురాల మార్కండేయ, బమ్మెర గ్రామ అధ్యక్షుడు దేవసాని నరేష్, దర్దేపల్లి గ్రామ అధ్యక్షుడు శ్రీరామ్ వెంకటేశ్వర్లు, ఈరవెన్ను గ్రామ అధ్యక్షుడు బిర్రు వెంకటేశ్వర్లు, వాల్మిడి గ్రామ అధ్యక్షుడు భారత శ్రీనివాస్, ముత్తారం గ్రామ కార్యదర్శి పిండిపోలు సత్యనారాయణ, పాలకుర్తి మండలంలోని వివిధ గ్రామాల అధ్యక్షుడు, కార్యదర్శులు,పద్మశాలి కుల బాంధవులు పాల్గొన్నారు.

## చేనేత కార్మికులకు ప్రభుత్వం చేయూత



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** చేనేత రంగాన్ని ప్రోత్సహించేందుకు, చేనేత కార్మికులకు ప్రభుత్వం చేయూతనందించి వారి ఆర్థికాభివృద్ధికి తోడ్పాటునందిస్తున్నదని జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య పేర్కొన్నారు. బుధవారం జాతీయ చేనేత దినోత్సవం పురస్కరించుకొని బుధవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మన నిత్య జీవితంలో చేతితో నేసిన వస్తువులకు ప్రాధాన్యత నివ్వడం జరగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో చేనేత రంగంలో సేవలు అందిస్తున్న 70 మంది కార్మికులను, చేనేత రంగంపై నిర్వహించిన వకృత్వ పోటీలో విజేతల్కైన ముగ్గురు విదార్థినీలను జిల్లా కలెక్టర్ ఘనంగా సన్మానించారు. హ్యాండ్ లూమ్, టెక్స్ టైల్స్ హనుమకొండ, వరంగల్ సహాయ సంచాలకులు విజయలక్ష్మి, రాఘవరావు, చేనేత కార్మికులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## చేనేత కార్మికుల్ని సన్మానించిన పోపా



**వరంగల్ వాయిస్, పరకాల :** జాతీయ చేనేత దినోత్సవం పురస్కరించుకొని పద్మశాలి సేవా సంఘం, పోపా పరకాల అధ్యక్షుడు డాక్టర్ పోతని రాజేశ్వర ప్రసాద్ నేతృత్వంలో ఘనంగా చేనేత కార్మికులకు సన్మానం, స్వీట్లు పంపిణీ చేశారు. వెల్లంపల్లి చేనేత సొసైటీ, పరకాల శ్రీనివాస చేనేత సొసైటీ చేనేత కార్మికులకు బట్టలు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పోపా అధ్యక్షుడు డాక్టర్ పి.రాజేశ్వర ప్రసాద్ మాట్లాడుతూ ముందుగా చేనేత కార్మికులందరికీ చేనేత దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఆ తర్వాత మానవ శరీరానికి కవచంగా ఉండే దుస్తులను నేసినటువంటి ఒక గొప్ప చారిత్రక గల వంశం మన పద్మశాలి వంశం అని, అందులో మన ఒక పద్మశాలి చేనేత కార్మికులు చాలా కష్టపడుతూ పోగు పోగును వేసి ఒక నూలు దుస్తుల్ని తయారు చేసే ఒక గొప్ప ఘనత పద్మశాలిలదేనని తెలిపారు. పద్మశాలీలు, చేనేత కార్మికులు అప్పటికి ఇప్పటికీ ఒక దీన పరిస్థితిలో ఉండటం అనేది జరిగింది. కాబట్టి, ప్రభుత్వాలు వెంటనే గుర్తించి చేనేత కార్మికులకు చేనేత సంఘాలను పునర్ నిర్మించి చేనేత కార్మికుల ఔన్నత్యాన్ని కాపాడడానికి మగ్గాలను కూడా పునరుద్ధరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పరకాల పట్టణ పద్మశాలి సేవా సంఘం గౌరవ అధ్యక్షుడు మార్త భిక్షపతి, సీనియర్ జర్నలిస్టు, పద్మశాలి సేవా సంఘం మాజీ అధ్యక్షుడు మెండు రవీందర్, శ్రీనివాస చేనేత సొసైటీ చైర్మన్ మంత్రి రాజేందర్, పోపా ప్రధాన కార్యదర్శి దుంపేటి నాగరాజు, పోపా ఉపాధ్యక్షుడు కొమాకుల రాజేందర్, ప్రచార కార్యదర్శి రాచర్ల శ్రీధర్, పద్మశాలి సంఘం రూరల్ గౌరవ అధ్యక్షుడు ఐతే సాంబయ్య, వెల్లంపల్లి సొసైటీ చైర్మన్ రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

## నడికూడలో..



**వరంగల్ వాయిస్, నడికూడ :** ప్రపంచ చేనేత దినోత్సవం సందర్భంగా పద్మశాలి సేవా సంఘం నడికూడ మండల అధ్యక్షుడు గాదె శంకరయ్య ఆధ్వర్యంలో మండలంలోని రాయపర్తి, చర్లపల్లి, వెంకటేశ్వర్ల పల్లె గ్రామాలలో బుధవారం ప్రపంచ చేనేత దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం కార్మికులను శాలువతో కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి పాశికంటి రమేష్, మండల యువజన సంఘం ప్రధాన కార్యదర్శి ఆకునూరి రమేష్, మండల నాయకులు కళ్యాణపు మూర్తి లింగం, మోతుకూరి శంకరయ్య, వంగర రమేష్, రాచర్ల శ్రీనివాస్, చేనేత సహకార సంఘం డైరెక్టర్లు, చైర్మన్లు తదితరులు పాల్గొన్నారు.

## చేనేత కార్మికులకు పుట్టినిల్లు కొత్తవాడ



**వరంగల్ వాయిస్, వరంగల్ :** జాతీయ చేనేత దినోత్సవ సందర్భంగా కొత్తవాడ కొండా లక్ష్మణ్ బాపూజీ జంక్షన్ వద్ద కాంగ్రెస్ పార్టీ నాయకులు 23వ డివిజన్ మాజీ కార్పొరేటర్ యెలుగం లీలావతి–సత్యనారాయణ చేనేత కార్మికులతో కలిసి నేత కార్మిక మగ్గం ప్రతిమకు పూలమాలను వేశారు. అనంతరం యెలుగం లీలావతి సత్యనారాయణ చేనేత కార్మికులను సత్కరించారు. ఈ సందర్భంగా యెలుగం లీలావతి సత్యనారాయణ మాట్లాడుతూ కొత్తవాడ అంటేనే చేనేత కార్మికులకు పుట్టినిల్లు అని అన్నారు. రేవంత్ రెడ్డి సారథ్యంలో నడుస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం కూడా నేడు హైదరాబాదులో చేనేత కార్మికుల సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చేనేత కార్మికులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని, చేనేత కార్మికుల సమస్యలను ఎప్పటికప్పుడు మంత్రి కొండా సురేఖ దృష్టికి తీసుకొని వెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భాషకర్ల హరిక్రిష్ణ పటేల్, లక్కర్స్ మొగిళి, రావుల రాజీవ్, అక్బర్, చేనేత కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## జడ్పీ ప్రత్యేక అధికారిగా కలెక్టర్ దివాకర టీఎస్



**వరంగల్ వాయిస్, ములుగు :** ములుగు జిల్లా పరిషత్ ప్రత్యేక అధికారిగా ములుగు జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ బుదవారం బాధ్యతలు స్వీకరించారు. ములుగు జిల్లా పరిషత్ పాలకవర్గం, జడ్పీ చైర్మన్ పదవీ కాలం మంగళవారంతో గడువు ముగియడంతో రాష్ట్ర ప్రభుత్వం ములుగు జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ కు, ములుగు జిల్లా పరిషత్ పాలక వర్గానికి ప్రత్యేక అధికారిగా నియమించగా ఆయన బాధ్యతలు చేపట్టారు. జిల్లా పరిషత్ సీఈఓ సంపత్ రావు, డిప్యూటీ సీఈఓ (ఎఫ్ఏసీ) జి.జవహర్ రెడ్డి, ములుగు ఎంపీడీఓ రామక్రిష్ణ, జిల్లా పరిషత్ అధికారులు దివాకర టీఎస్ ను కలిసి పూలమొక్కను అందచేసి శాలువాతో సత్కరించారు.

## మాజీ సర్పంచ్ దాతృత్వం



**వరంగల్ వాయిస్, కమలాపూర్ :** మండలంలోని కన్నూరు గ్రామ అంగన్వాడీ-1సెంటర్ కు తాజా మాజీ సర్పంచ్ పుల్లూరి రాంచందర్ రావు బుధవారం కుర్చీలు అందజేశారు. చిన్నారులు కూర్చునేందుకు వీలుగా 20 కుర్చీలు తన సొంత నిధులతో కొనుగోలు చేసి అందజేసి దాతృత్వం చాటుకున్నారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ మాట్లాడుతూ.. పదవిలో ఉన్నప్పుడు గ్రామాభివృద్ధికి తన వంతు కృషి చేశానని తెలిపారు. ప్రస్తుతం పిల్లలకు కుర్చీలు అందజేయడం సంతోషంగా ఉందని, చిన్నారులను అంగన్వాడీ కేంద్రాలకు పంపించాలని తల్లిదండ్రులకు సూచించారు. కేంద్రాల్లో పౌష్టికాహారం అందుతుందని అన్నారు. భవిష్యత్తులో మరింత సాయం చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ కవిత, హైస్కూల్ ఉపాధ్యాయులు, ఆయా ఉన్నారు.

## స్వచ్ఛదనం-పచ్చదనం సామాజిక బాధ్యత



**వరంగల్ వాయిస్, పరకాల :** పట్టణ కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు, అధికారులు ప్రజాప్రతినిధులతో కలిసి పరకాల ఎమ్మెల్యే ఎమ్మెల్యే ప్రకాశ్ రెడ్డి మొక్కలను నాటారు. అనంతరం మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఇంకుడు గుంత నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి గారు మాట్లాడుతూ గ్రామాలు, పట్టణాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని అన్నారు. సీజనల్ వ్యాధుల నియంత్రణకు వైద్య, పంచాయతీరాజ్, మున్సిపల్, వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునే విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. డెంగీ, మలేరియా జ్వరాలు ప్రబలకుండా చర్యలు తీసుకుంటూ ప్రతిరోజు ఫాగింగ్ చేయాలన్నారు. భవిష్యత్తులో సైతం గ్రామాలు, పట్టణాలలో స్వచ్ఛదనం-పచ్చదనం కొనసాగేందుకు ఇక పై ప్రతి నెలలో 3వ శనివారం స్వచ్ఛదనం-పచ్చదనం దినంగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని అధికారులు రెగ్యులర్ గా పర్యవేక్షించాలని సూచించారు.

## డీఈఓను తొలగించాలి



**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** మానుకోట జిల్లా విద్యాశాఖాధికారి అర్హతలు లేకుండా అక్రమంగా అధికారి భాద్యతలు చేపటి అనేక అక్రమాలకు పాల్పడుతూ జిల్లా విద్యావ్యవస్థను భ్రష్టు పట్టిస్తున్న అసమర్ధ డీఈఓను తొలగించాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి డిమాండ్ చేశారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మురళీకృష్ణ అధ్యక్షతన జిల్లా కేంద్రంలో నిర్వహించిన ధర్నాకు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ రాష్టంలో బదిలీలు, పదోన్నతులలో ఎక్కడ జరుగని అనేక అవకతవకలు జరగడానికి అర్హతలు లేని డీఈఓ కారణమన్నారు. ఈ నిరసనకు భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) జిల్లా కమిటీ సంపూర్ణ మద్దతు ప్రకటించి ధర్నాను ఉద్దేశించి జిల్లా కో కన్వీనర్ గుగులోతు సూర్య ప్రకాష్ మాట్లాడారు. విద్యార్థికి ఉన్న అవగాహన మహబూబాబాద్ డీఈఓకు లేదని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి ఎస్ మల్లారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్కె యాకూబ్, రిటైర్డ్ పూర్వ రాష్ట్ర కార్యదర్శి ఎస్డీ జియావుద్దీన్, జిల్లా ఉపాధ్యక్షులు రమేష్, స్వప్న, జిల్లా కార్యదర్శులు నామ వెంకటేశ్వర్లు, గదంశెట్టి వివేక్ వీరస్వామి, భిక్షపతి, వెంకన్న, మంజుల, జనార్ధన చారి, మండలాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు సభ్యులు పాల్గొన్నారు. సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు ఘనపురపు అంజయ్య సంఘీభావం తెలిపారు

# పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

### జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్



**వరంగల్ వాయిస్, ములుగు :** పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అన్నారు. బుధవారం ములుగులోని బండారుపల్లి రోడ్డు, కృష్ణ కాలనీలలో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా మూడవ రోజు చేపట్టిన సైడ్ డ్రైనేజ్ క్లీన్ పనులను జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామంలో గల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, గ్రామాలలో పరిశుభ్రత పచ్చదనం పెంపొందించడం లక్ష్యంగా ప్రభుత్వం స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమాన్ని చేపట్టినదని తెలిపారు. మూడవ రోజు చేపట్టాల్సిన మురుగుకాల్వలు పూడిక తీయుట, వర్షపు, మురుగునీరు నిల్వ ఉండకుండా డ్రైనేజీల్లోకి మళ్లించుట, లోతట్టు ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టుట, గుంతలు పడిన రహదారులను గుర్తించి గుంతలను పూడ్చే పనులు చేపట్టుట, తాగునీటి చేతిపంపులు వద్ద మురుగునీరు నిల్వకుండా చర్యలు చేపట్టుట జరుగుతుందని ఆయన తెలిపారు. నిర్దిష్ట లక్ష్యాన్ని చేరుకునే విధంగా రోజు వారి కార్యచరణ ప్రకారం అధికారులు అన్ని మండలాలలో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేయాలని సూచించారు. స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమం కేవలం 5 రోజుల పాటు కాకుండా నిరంతరం కొనసాగే విధంగా అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు అందరూ సమిష్టిగా బాధ్యతతో పని చేసినప్పుడు ఈ కార్యక్రమం విజయవంతం అవుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజలు కూడా సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రామకృష్ణ, ఎంపీఓ రహిమొద్దీన్, గ్రామ పంచాయతీ కార్యదర్శి రఘు, తదితరులు పాల్గొన్నారు.

# అఖిల భారత ఆదివాసి సదస్సును జయప్రదం చేయండి

### కరపత్రం ఆవిష్కరించిన ప్రజా సంఘాలు



**వరంగల్ వాయిస్, ఖిలా వరంగల్ :** ఈనెల 9, 10 తేదీలలో హైదరాబాదులోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరుగు ఆదివాసి అఖిల భారత ఆదివాసి సదస్సును జయప్రదం చేయాలని కోరుతూ బుధవారం ఖిలా వరంగల్ పడమరకోట చమన్ సెంటర్ అంబేద్కర్ విగ్రహం ముందు వివిధ ప్రజా సంఘాల నాయకులు కరపత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అఖిల భారత రైతు కూలీ సంఘం ఏఐకేఎంఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు రాచర్ల బాలరాజు మాట్లాడుతూ ఆదివాసి హక్కుల పోరాట సంఘీభావ వేదిక ద్వారా రెండు రోజులు జరుగుతాయని, ఈ కార్యక్రమానికి ముందుగా వేదిక కోఆర్డినేటర్ ప్రొఫెసర్ హరగోపాల్ అధ్యక్షత వహిస్తారని ఆహ్వాన సంఘం అధ్యక్ష ఉపన్యాసం ప్రొఫెసర్ మాడభూషి శ్రీధర్ ఇస్తారని ఆయన తెలిపారు. సుప్రీంకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ సుదర్శన్ రెడ్డి ప్రారంభ ఉపన్యాసం చేస్తారని, సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి రాజా, నాయకులు సురవరం సుధాకర్ రెడ్డి, ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావులు మాట్లాడతారని ఆయన అన్నారు. అనంతరం జరిగే కార్యక్రమంలో దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే మేధావులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మధ్య భారత దేశంలో ఆదివాసి ప్రజలపై జరుగుతున్న దమనకాండ నిరాశ్రయికరణ హక్కుల సంహరణ గురించి మాట్లాడుతారని తెలిపారు. అలాగే, అటవీ ప్రాంతాల్లో ఉన్న సహజ సంపద ఖనిజ సంపద కోసం కార్పొరేట్ సంస్థలు చేసే విధ్వంసంపై, భారత రాజ్యాంగంలోని ఐదు, ఆరు షెడ్యూల్లో ఉన్న ఆదివాసి హక్కుల గురించి ప్రసంగాలు ఉంటాయని ఆయన పేర్కొన్నారు. 10వ తేదీ సాయంత్రం నాలుగున్నర గంటలకు, ఊరేగింపు బహిరంగ సభ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వివిధ వర్గాల ప్రజానికాన్నీ ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఇనుముల కృష్ణ, మైనంపాని బన్న నర్సింగం, మన్నే కరుణాకర్, హరిబాబు, ఎండీ అక్బర్, ఎస్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## కుట్టుశిక్షణతో మహిళలకు ఉపాధి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** మహిళలకు కుట్టు శిక్షణతో భవిష్యత్ లో ఉపాధి పొందవచ్చని 30వ డివిజన్ కార్పొరేటర్ రావుల కోమల కిషన్ అన్నారు. బుధవారం బాలసముద్రం శ్రీనివాసకాలని ఆరే సంఘం భవనంలో అన్నమ్మనేని మేఘాంశ్ రావు (ఏఎంఆర్) ఫౌండేషన్ ఆధ్వర్యంలో సిరి స్వచ్ఛంద సంస్థ భాగస్వామ్యంతో కుట్టు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. సిరి స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు డాక్టర్ పరికి సుధాకర్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కార్పొరేటర్ రావుల కోమల కిషన్ మాట్లాడుతూ స్థానిక మహిళలకు కుట్టు శిక్షణ ఎంతగానో దోహదపడుతుందని, భవిష్యత్ లో స్వయం ఉపాధితో అభివృద్ధి చెందవచ్చని, కుట్టు, మగ్గం, అల్లికలు ద్వారా సాటి మహిళలకు ఉపాధి కల్పించవచ్చని అన్నారు. మూడు నెలల పాటు నేర్పించే శిక్షణ ద్వారా కాలనీ మహిళలు కుట్టు శిక్షణ నైపుణ్యాలు మెరుగుపరచుకొని మహిళా స్వావలంబన దిశగా కొనసాగాలని అన్నారు. చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఛైర్పర్సన్ అన్నమనేని అనిల్ చందర్ రావు మాట్లాడుతూ మహిళలకు కుట్టు శిక్షణ ఇప్పించడంతో స్వయం ఉపాధి అవకాశాలు పొందుతారనే ఉద్దేశంతో ఉచిత శిక్షణ నిర్వహించడం అభినందనీయమని అన్నారు. సిరి స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు డాక్టర్ సుధాకర్ మాట్లాడుతూ 2021 నుంచి హనుమకొండ, కాజీపేట, వరంగల్ ప్రాంతాల్లో ఇప్పటివరకు 15 విడుతలుగా శిక్షణ కార్యక్రమం నిర్వహించి, 25 మందికి ఉచిత కుట్టు మిషన్ లు అందజేశామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆరే సంఘం భవనం అధ్యక్షుడు రాజేశ్వర్ రావు, సభ్యులు పి.విజయ, పి.శంకర్ రావు, ఐసీడీఎస్ సూపర్ వైజర్ వంచ రాజ్యలక్ష్మి, స్థానిక అంగన్వాడీ టీచర్ రామ తార, డాక్టర్ పాలడుగు సురేందర్, సెంటర్ టీచర్లు సునీత, స్వప్న, కే.మమత, సంధ్య, కల్పన, రజిత, తదితరులు పాల్గొన్నారు.

## పిల్లలకు తల్లి పాలు తాగించాలి



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** పిల్లలకు ఆరు నెలల వయస్సు వరకు కేవలం తల్లి పాలు మాత్రమే త్రాగించాలని జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి కళావతి బాయి పేర్కొన్నారు. తల్లి పాల వారోత్సవాల ముగింపు సందర్భంగా బుధవారం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఇందిరానగర్ ఉపకేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ కాన్పు అయిన వెంటనే వచ్చే ముర్రు పాలు మొదటి కొద్ది రోజులు చిక్కగా, పసుపు రంగులో ఉంటాయని, వీటిని ముర్రుపాలు లేదా కొలస్ట్రం అంటారని ఇందులో ప్రోటీన్లు, రోగాలను ఎదుర్కొనే శక్తిని పెంచే గుణం ఎక్కువగా ఉంటుందని, వీటికి తోడుగా విటమిన్ ఎ,బి లతో పాటు తగినంత ఐరన్ కూడా ఉంటుందని, ముర్రుపాలు బిడ్డకు సంజీవని వంటివని ఇవి అమృతంతో సమానమని ఆమె అన్నారు. మున్సిపల్ వైస్ ఛైర్మన్ మార్నేని వెంకన్న మాట్లాడుతూ ముర్రుపాలతో శిశువులు చక్కగా పెరుగుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బస్తీ దావఖాన వైద్యాధికారి డాక్టర్ శివ, నర్సింగ్ స్కూల్ ప్రిన్సిపాల్ లీలావతి, డిప్యూటీ డెమో గొప్ప ప్రసాద్, 18వ వార్డు కౌన్సిలర్ ఎడ్ల వేణు, తొమ్మిదో వార్డు కౌన్సిలర్ హరి సింగ్ , మార్నేని కిరణ్ , సబ్ యూనిట్ ఆఫీసర్ ఓబిలిశెట్టి రామకృష్ణ, నర్సింగ్ కాలేజ్ ట్యూటర్ రామారావు, సిస్టర్లు దీన దయావతి, అశ్విని, ఆశాలు కళావతి, మాధవి, విజయ, మంగమ్మ, రేణుక, అంగన్వాడీ టీచర్ మెహమూద, గర్భిణీ స్త్రీలు, బాలింతలు, నర్సింగ్ కాలేజీ పిల్లలు పాల్గొన్నారు.

# విద్యార్థులను గొర్లవీడు పాఠశాలలో చేర్పించండి

## ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



**వరంగల్ వాయిస్, భూపాలపల్లి :** విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడానికి నిష్ణాతులైన ఉపాధ్యాయ బృందం గొర్లవీడు పాఠశాలలో ఉన్నారని, కాబట్టి విద్యార్థుల బంగారు భవిష్యత్ కు గొర్లవీడు ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని గొర్లవీడు చుట్టుపక్కల ఆవాస ప్రాంతాల తల్లిదండ్రులను భూపాలపల్లి శాసనసభ్యుడు గండ్ర సత్యనారాయణ రావు కోరారు. గొర్లవీడు ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు డి.అనిత అధ్యక్షతన ఉపాధ్యాయ బృందం సమిష్టిగా ఆర్థిక చేయూత అందించి, విద్యార్థులకు ఉచితంగా బెల్టు, టై, షూస్, ఐడీ కార్డులు, డైరీలు అందజేసే కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ ప్రభుత్వం పాఠశాల విద్యకు బడ్జెట్ లో అధిక నిధులు కేటాయించి అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా మౌలిక వసతులు కల్పించిందన్నారు. ఇటీవలే పాఠశాలలకు ఉచిత విద్యుత్ సౌకర్యం, పారిశుధ్యం కోసం నెలవారీగా నిధులు కేటాయించిందని తెలిపారు. భవిష్యత్తులో ఆవాస ప్రాంత విద్యార్థులకు రవాణా సౌకర్యం కల్పించి ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య ప్రభుత్వ పాఠశాలలో అందించే విధంగా ప్రభుత్వం చర్యలు చేపడుతుందని పేర్కొన్నారు. కాబట్టి, తల్లిదండ్రులందరూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వినియోగించుకోవాలన్నారు. తమ పిల్లల బంగారు భవిష్యత్తుకు బాటలు వేసే విధంగా ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు. ఈ సందర్భంగా గొర్లవీడు ఉపాధ్యాయ బృందాన్ని మిగతా పాఠశాలల ఉపాధ్యాయ బృందం ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. గత సంవత్సరం గొర్లవీడు పాఠశాలలో చదివి త్రిబుల్ ఐటీ బాసర విద్యాసంస్థకు ఎంపికైన మారేపల్లి అక్షితను శాలువాతో సత్కరించి, అభినందించారు. ఈ సమావేశంలో హెచ్ఎం, ఉపాధ్యాయ బృందం పాఠశాలలో అసంపూర్తిగా ఉన్న ప్రహరీ గోడ నిర్మాణం, వాటర్ ప్లాంట్ ఏర్పాటు, క్రీడా మైదానం చదును చేయడం, అసంపూర్తిగా ఉన్న మన ఊరు-మనబడి పనులను పూర్తి చేయడానికి, టాయిలెట్స్ నిర్మాణానికి నిధులు కేటాయించాలని కోరగా ఎమ్మెల్యే సత్వరమే స్పందించి నిధులు కేటాయిస్తామని స్పష్టమైన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ పరీక్షల విభాగం అధికారి మండల రవీందర్ రెడ్డి, డీపీఓ నారాయణరావు, డీఎల్పీఓ వీరభద్రం, ఎంపీఓ నాగరాజు, గ్రామస్తులు రామినేని రవీందర్, సదయ్య, ఉపాధ్యాయులు ఆర్.సుభాకర్ రెడ్డి, కె.దేవదాసు, ఏ.జయప్రకాష్, కె.శంకర్రావు, పి.శంకర్రావు, బి.వెంకటేశ్వర్లు, కె.వంశీ రెడ్డి, ఎస్.కుమారస్వామి, యం.నవనీత్ కుమార్, కె.రమాదేవి, జె.మాలతి, మేనక, రియాజ్, అరుణ తదితరులు పాల్గొన్నారు.

## చెత్తను శ్రమదానంతో తొలగించాలి



**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** ప్రభుత్వం తలపెట్టిన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి శ్రమదానం చేసినట్లయితే డివిజన్ ప్రజలందరు ఆరోగ్యంగా జీవిస్తారని 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి అన్నారు. కార్యక్రమంలో 3వ రోజు డివిజన్ ఆఫీసర్ వెంకన్న ఆధ్వర్యంలో జరిగిన శ్రమదాన కార్యక్రమాన్ని కార్పొరేటర్ మరుపల్ల రవి ప్రారంభించారు. ప్రతి ఇంటి ముందు పెరిగిన పిచ్చి మొక్కలను గడ్డిని ఇంటి యజమానులు తొలగించుకొని కార్పొరేషన్ కు సహకరించాలని అయన కోరారు. కరీమాబాద్ వాటర్ ట్యాంక్ ఆవరణ చుట్టు పెరిగిన పిచ్చి మొక్కలను ప్రజలు శ్రమదానంతో తొలగించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ఆఫీసర్ వెంకన్న, వార్డు ఆఫీసర్ ఎన్.శంకర్, సంబె.రజిత, ఆర్పీలు రాధిక, మాధవి, శ్రీలత, శారద, సౌజన్య, రాజేశ్వరి, స్వర్ణలత, ఓబీలు, ప్రజలు పాల్గొన్నారు.

## కనకదుర్గ గుడి స్థలం పరిశీలన



**వరంగల్ వాయిస్, శాయంపేట :** శాయంపేట మండల కేంద్రంలో ఉన్నటువంటి పురాతనమైన కనుక దుర్గమ్మ గుడికి ఉన్న స్థలాన్ని ఆక్రమణ గురి కావడంతో 2022లో స్థానికుడైన వంగర సాంబయ్య లోకాయుక్తలో ఫిర్యాదు చేశారు. దీంతో బుధవారం పరకాల ఆర్డీఓ నారాయణ స్థానిక తహసీల్దార్ సుభాషినితో కలిసి బుధవారం స్థలాన్ని పరిశీలించి విచారణ జరిపారు. ఈ సందర్భంగా ఆర్డీవో నారాయణ మాట్లాడుతూ విచారణ జరిపిన అనంతరం గుడి నిర్మాణం కోసం మూడు గుంటల భూమిని కేటాయిస్తున్నట్లు తెలిపారు. ఈ గుడి నిర్మాణానికి అనువుగా స్థలానికి హద్దులు నిర్ణయించాలని అధికారులను ఆదేశించారు. ప్రజల ఆకాంక్ష అయిన కనకదుర్గమ్మ గుడికి స్థలం కేటాయించడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు

# అన్యురిజం క్లిప్పింగ్, ఎక్సిసన్‌కు క్లిష్టమైన శస్త్ర చికిత్స

## రోగి ప్రాణాలను కాపాడిన మెడికవర్ వైద్యులు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** అత్యాధునిక సదుపాయాలు 24/7 ఎమర్జెన్సీ వైద్య సేవలు అనుభవజ్ఞులైన డాక్టర్స్ వల్లనే 56 సంవత్సరాల మహిళకు వరంగల్ మెడికవర్ హాస్పిటల్ లో అత్యంత క్లిష్టమైన శస్త్ర చికిత్స అన్యురిజం క్లిప్పింగ్, ఎక్సిసన్ వైద్యం చేసి రోగి ప్రాణాలను కాపాడటం జరిగిందని మెడికవర్ హాస్పిటల్స్ క్లస్టర్ హెడ్ సిద్ధారెడ్డి తెలిపారు. బుధవారం హంటర్ రోడ్డులోని మెడికవర్ హాస్పిటల్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డాక్టర్లు మాట్లాడుతూ 56 సంవత్సరాల గల మహిళ తలనొప్పి రావడంతో న్యూరో ఫిజీషియన్ దగ్గర చూపించుకోవడం జరిగిందని, న్యూరో ఫిజీషియన్ ఆదేశాల మేరకు సిటి స్కాన్ చేసి సిటీ స్కాన్ లో మెదడు పొరలలో రక్తస్రావ్యం ఏర్పడిందని తెలిపారు. తరువాత మెడికవర్ హాస్పిటల్ వరంగల్ ఎమర్జెన్సీ డిపార్ట్మెంట్ కు రావడం జరిగిందని, డాక్టర్ ప్రియాంక న్యూరో ఫిజీషియన్, డాక్టర్ ప్రదీప్ రాజన్న, డాక్టర్ లక్ష్మీదీపక్ ఎమర్జెన్సీ అండ్ క్రిటికల్ కేర్ ఆధ్వర్యంలో పేషంట్ కి సిటీ బ్రెయిన్ విత్ యాంజియోగ్రామ్ పరీక్ష చేయడం జరిగిందని తెలిపారు. స్కాన్ లో కుడివైపు ముఖ్యమైన రక్తనాళానికి అన్యూరిజం ఉండడం గమనించి టి.సంజయ్ న్యూరో సర్జన్, డాక్టర్ అవనీష్ అనస్తీసియా విభాగం ఆధ్వర్యంలో అన్యురిజం క్లిప్పింగ్ తొలగించారు. అన్యురిజం తొలగించడం వరంగల్ నగరంలో మొట్టమొదటిసారిగా మెడికవర్ హాస్పిటల్ లో జరిగిందని, శస్త్ర చికిత్స అనంతరం ఆ మహిళ పూర్తిగా కోలుకొని మామూలు స్థితిలో మెడికవర్ హాస్పిటల్ నుంచి డిశ్చార్జ్ అయినట్లు తెలిపారు. డిశ్చార్జ్ అనంతరం ఆ మహిళ చేతులు కాళ్లు పూర్తి బలంతో మామూలుగా నడుస్తూ తన పనులు తను చేసుకుంటున్నారన్నారు.డాక్టర్ టి. సంజయ్ వివరిస్తూ మెదడు రక్తనాళానికి అన్యూరిజం చిట్లి రక్తస్రావ్యం మొదటిసారి జరిగినప్పుడు 33 శాతం, రెండవసారి జరిగినప్పుడు 65 శాతం మూడోసారి జరిగినప్పుడు 95 శాతం మంది చనిపోయే ప్రమాదం ఉంటుందని తెలిపారు. ఈ అన్యురిజం క్లిప్పింగ్ అండ్ ఎక్సిసన్ అనే శస్త్ర చికిత్స అతి సున్నితమైన చికిత్స అని వివరించారు. అన్యురిజం క్లిప్పింగే కాకుండా మొదటిసారిగా వరంగల్ లో అన్యురిజం ఎక్సిషన్ చేసి రోగి ప్రాణాలు కాపాడగలిగామని తెలిపారు. బ్రెయిన్ అన్యూరిజం ఉన్నప్పుడు కొన్ని సంకేతాలు కనిపిస్తాయన్నారు. ముఖ్యంగా తీవ్రమైన తలనొప్పి, మెడ నొప్పి, చూపు మసకబారడం, స్పృహ కోల్పోవడం వంటి సమస్యలు కలుగుతాయని వీటిని నిర్లక్ష్యం చేయకూడదని సూచించారు. ఏ లక్షణమైనా ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని తెలిపారు. అనంతరం పేషంట్ కుటుంబ సభ్యులు డాక్టర్ టి.సంజయ్ న్యూరో సర్జన్ కు, వైద్య సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు. ఈ సమావేశంలో మెడికవర్ హాస్పిటల్ డాక్టర్లు , సిబ్బంది పాల్గొన్నారు.

## గ్రామాలను సుందరంగా మార్చాలి



**వరంగల్ వాయిస్, పరకాల :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా బుధవారం పరకాల మండల ప్రత్యేక అధికారి డాక్టర్ కె.వెంకటనారాయణ మండల పరిషత్ అభివృద్ధి అధికారి పెద్ది ఆంజనేయులుతో కలిసి కామారెడ్డిపల్లి, అలియాబాద్ గ్రామాలలో పర్యటించి సిబ్బందికి సలహాలు, సూచనలు జారీ చేశారు. ఈ నెల 9 వరకు జరిగే స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో గ్రామాలు సుందరంగా మార్చాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి పల్లి గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారి వినోద్ కుమార్, పంచాయతీ కార్యదర్శులు ప్రవీణ్ కుమార్, అలియాబాద్ పంచాయతీ కార్యదర్శి అంజనీదేవి, అంగన్వాడీ టీచర్లు, ఆశాలు, గ్రామ ప్రజలు, గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరం




**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** వర్షాకాలంలో అనారోగ్యంతో గురైన పేదలకు ఉచిత వైద్య శిబిరాలు ఎంతో ఉపయోగపడుతాయని 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి అన్నారు. బుధవారం కుమ్మరి సేవా భవనంలో రంగశాయిపేట ప్రైమరీ హెల్త్ సెంటర్ డాక్టర్ కే.వేదవి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వైద్య శిబిరానికి కార్పొరేటర్ మరుపల్ల రవి ముఖ్యఅతిథిగా హాజరై రోగులకు మందులను అందజేశారు. ఏ వ్యక్తైన అనారోగ్యానికి గురైతే వెంటనే డాక్టర్లను సంప్రదించి వైద్యం పొందాలన్నారు. నిర్లక్ష్యం చేసినట్లయితే రోగులు ఇబ్బంది పాలవుతారని సూచించారు. ఈ వైద్య శిబిరంలో 65మంది రోగులకు డాక్టర్ కే.వేదవి పరీక్షించి వారికి ఉచితంగా మందులు పంపిణీ చేయడం జరిగింది. ఈ వైద్య శిబిరంలో ఏ.సుజాత సీఓఈ సుష్మా, స్టాఫ్ నర్స్ ఏ.భాగ్యలక్ష్మి, ఏఎన్ఎం ప్రవీణ్, రజిత, అనిత, గౌస్ పాష, అవునూరి నాగరాజు ఉన్నారు.

## జగదీశ్ యాదవ్‌ను కలిసిన నూతన కమిటీ బాధ్యులు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** తెలంగాణా రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ జగదీశ్ యాదవ్ ను హైదరాబాద్ ఒలంపిక్ భవన్ లో బుధవారంనూతన కమిటీ బాధ్యులు హనుమకొండ జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు మహమ్మద్ అజీజ్ ఖాన్, సెక్రటరీ ఆకుల సారంగపాణి, వరంగల్ జిల్లా అధ్యక్షుడు రాంరెడ్డి, సెక్రటరీ అబ్దుల్లా ఖాన్, మహేందర్ రెడ్డి, మహ్మద్ అక్తర్, కందుల సృజన్ కాంత్ మర్యాద పూర్వకంగా కలిశారు.

## స్వచ్ఛదనం-పచ్చదనంలో భాగస్వాములు కావాలి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమం లో ప్రజలందరూ భాగస్వాములు కావాలని వరంగల్ ఏసీపి నందిరాం నాయక్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వరంగల్ శ్రీ భద్రకాళి దేవాలయ ఆవరణలో ఏసీపీ నందిరాం నాయక్ పూల మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో సీఐ. తుమ్మ గోపి, భద్రకాళి ఆలయ సూపర్డెంట్ అద్దంకి విజయ్ కుమార్, కేఎంసీ ఫిజికల్ డైరెక్టర్ తుమ్మ ప్రభాకర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

### భారత్‌లో ప్రసారం లేకుండా..

## మరోమారు ఓటిటిలోకి అన్నపూరణి

అగ్ర కథానాయిక నయనతార ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'అన్నపూరణి' నీలేశ్ కృష్ణ దర్శకత్వంలో తెరకెక్కింది. ఈ సినిమాలోని కొన్ని సన్నివేశాల విషయంలో వివాదం తలెత్తడంతో ఓటీటీ ప్లాట్‌ఫామ్ నెట్‌ఫ్లిక్స్ నుంచి దీనిని తొలగించిన విషయం తెలిసిందే. దాదాపు ఏడు నెలల తర్వాత ఇప్పుడీ చిత్రం తిరిగి ఓటీటీ స్ట్రీమింగ్‌కు సిద్ధమైంది. సింప్లీ సౌత్ అనే ఓటీటీ ప్లాట్‌ఫామ్ వేదికగా ఆగస్టు 9 నుంచి ఇది స్ట్రీమింగ్ కానుంది. ఈ విషయాన్ని తెలియజేస్తూ సదరు సంస్థ సోషల్‌మీడియాలో పోస్ట్ పెట్టింది. 'అన్నపూరణి ఈజ్ బ్యాక్. భారతదేశాన్ని మినహాయించి ప్రపంచవ్యాప్తంగా ఉన్న సినీ ప్రియులకు ఆగస్టు 9 నుంచి ఇది అందుబాటులో ఉండనుందని పేర్కొంది. అయితే, ఇక్కడ రిలీజ్ చేయకపోవడానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదు. నయనతార 75వ చిత్రంగా 'అన్నపూరణి' విడుదలైంది. 'ది గాడెస్ ఆఫ్ ఫుడ్' అనేది ట్యాగ్ లైన్. లేడీ ఓరియెంటెడ్ మూవీగా తెరకెక్కిన ఈ చిత్రంలో సత్యరాజ్, జై కీలక పాత్రలు పోషించారు. సంప్రదాయ కుటుంబంలో జన్మించిన అమ్మాయి.. చెఫ్‌గా ఎదగాలనే తన కలను ఎలా సాకారం చేసుకుంది? అనే కథాంశంతో దీనిని రూపొందించారు. థియేటర్లలో మిశ్రమ స్పందనలు సొంతం చేసుకొంది. జనవరి నెలలో నెట్‌ఫ్లిక్స్‌లో విడుదల కాగా.. ఇందులోని కొన్ని సన్నివేశాలు మత విశ్వాసాలను దెబ్బతీసేలా ఉన్నాయంటూ పలువురు అభ్యంతరాలు వ్యక్తంచేశారు. నయనతారతోపాటు చిత్రబృందంపై ముంబయి, మధ్యప్రదేశ్‌లోని జబల్పూర్‌లో ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. ఈ నేపథ్యంలోనే చిత్ర నిర్మాణసంస్థ ఓటీటీ నుంచి తొలగించింది. మరోవైపు, నయనతార సైతం ఈ విషయంపై స్పందించారు. అన్నపూరణి సినిమాను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు మంచి ఆలోచనతో రూపొందించాం. సంకల్ప బలం ఉంటే ఏదైనా సాధించవచ్చని తెలియజేసేందుకు తెరకెక్కించాం. ఈ ప్రయత్నంలో మాకు తెలియకుండానే కొందరి మనసులను గాయపరిచాం. సెన్సార్ బోర్డు సర్టిఫికెట్ ఇచ్చిన సినిమాను ఓటీటీ వేదిక నుంచి తొలగిస్తారని ఊహించలేదు. మా చిత్రబృందం, నేను ఎవరి మనోభావాలను దెబ్బతీయాలని అనుకోలేదు. నేను ఉద్దేశపూర్వకంగా ఇలా చేయలేదు. మీ మనోభావాలను గాయపరిచినందుకు క్షమించండి అని పేర్కొన్నారు.





## అఖిల్ అక్కినేనికి కలసిరాని కాలం

### ఓ మంచి సినిమా కోసం తండ్రి నాగ్ యత్నాలు

హీరోగా అఖిల్ అక్కినేనికి కలిసి రావడం లేదు. చిన్నప్పుడు చేసిన 'సిసింద్రీ', గెస్ట్ అప్పీరియెన్స్ ఇచ్చి 'మనం' మినహా.. అఖిల్‌కు చెప్పుకోవడానికి సరైన హిట్ ఇంత వరకు పడలేదనే చెప్పుకోవాలి. ఎలాగైనా అఖిల్‌కి ఓ బ్లాక్‌బస్టర్ ఇవ్వాలని తండ్రి నాగార్జున చేయని ప్రయత్నాలు లేవు. భారీ బడ్జెట్‌తో తెరకెక్కి, ఎన్నో అంచనాల నడుమ విడుదలైన 'ఏజెంట్' మూవీ కూడా అఖిల్‌కు సక్సెస్‌ని ఇవ్వలేకపోయింది. ఆ సినిమా వచ్చి సంవత్సరం పూర్తయినా.. ఇంత వరకు అఖిల్ తర్వాత సినిమాకు సంబంధించి ఎటువంటి ప్రకటనా రాలేదంటే.. అఖిల్ విషయంలో అక్కినేని ఫ్యామిలీ ఎంత డైలామాలో ఉందో అర్థం చేసుకోవచ్చు. అసలు అఖిల్ కు ఎలాంటి సినిమా పడాలి? అఖిల్‌ని ఎలా ప్రేక్షకులలో నిలబెట్టాలి? అనే ఆలోచనలో ఉన్న అక్కినేని ఫ్యామిలీ.. చివరకు ఓ నిర్ణయానికి వచ్చినట్లుగా తెలుస్తోంది. అఖిల్ చేయబోయే తదుపరి సినిమా కోసం.. కింగ్ నాగార్జునతో పాటు యువసామ్రాట్ అక్కినేని నాగచైతన్య కూడా రంగంలోకి దిగబోతున్నట్లుగా టాలీవుడ్‌లో టాక్ వినబడుతోంది. నాగార్జున, నాగచైతన్యలు.. అఖిల్ తదుపరి సినిమాను నిర్మించాలనే ఆలోచనలో ఉన్నారట. త్వరలోనే ఈ సినిమాకు సంబంధించి అనౌన్స్‌మెంట్ రానుందనేలా టాలీవుడ్ సర్కిల్స్‌లో వార్తలు వినబడుతున్నాయి. వాస్తవానికి 'ఏజెంట్' తర్వాత అఖిల్ చేయబోయే సినిమా యూవీ క్రియేషన్స్ బ్యానర్‌లో ఉంటుందనేలా ఏడాది కాలంగా ప్రచారం జరుగుతూనే ఉంది కానీ.. ఈ ప్రాజెక్ట్ ముందుకు వెళుతున్నట్లుగా అయితే ఎటువంటి అప్డేట్ ఇంత వరకు రాలేదు. ఆ ప్రాజెక్ట్ సంగతి ఏమోగానీ.. ఇప్పుడు ఓ యువ దర్శకుడు చెప్పిన స్టోరీ నచ్చటంతో అఖిల్‌తో సినిమా చేసేందుకు నాగార్జునతో పాటు, నాగ చైతన్య కూడా రంగంలోకి దిగుతున్నట్లు సమాచారం. కిరణ్ అబ్బవరంతో 'వినరో భాగ్యము విష్ణు కథ' వంటి హిట్టు సినిమా తీసిన మురళీ కిషోర్ చెప్పిన కథ నచ్చడంతో.. అఖిల్ నెక్ట్స్ ప్రాజెక్ట్‌గా ఈ సినిమా ఉండబోతుందని, ఈ సినిమాకు 'లెనిన్' అనే టైటిల్‌ను పరిశీలిస్తున్నట్లుగా తెలుస్తోంది. అంతా సెట్టయితే.. అన్నపూర్ణ స్టూడియోస్‌కు అనుబంధంగా మనం ఎంటర్‌ప్రైజెస్ అనే బ్యానర్‌లో ఈ సినిమాను నాగార్జున, చైతన్య నిర్మించాలని చూస్తున్నారని టాక్. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## తమిళ బ్లాక్ బ్లస్టర్

### సూపర్ డీలక్స్ 9న విడుదల



కోలీవుడ్‌లో ఎప్పుడో విడుదలై ఘన విజయం సాధించిన మాస్టర్ పీస్ చిత్రం.. ఇన్నాళ్ల తర్వాత తెలుగులో గ్రాండ్ రిలీజ్‌కు సిద్ధమైంది. మక్కల్ సెల్వన్ విజయ సేతుపతి, 'పుష్ప' ఫేమ్ ఫహద్ ఫాసిల్ , సమంత ముఖ్య పాత్రల్లో రమ్యకృష్ణ, మిస్కిన్, గాయత్రి, భగవతి పెరుమాళ్ ఇతర ముఖ్య పాత్రల్లో నటించిన మాస్టర్ పీస్ చిత్రం 'సూపర్ డీలక్స్'. ఈ సినిమా తమిళ్‌లో బ్లాక్‌బస్టర్ విజయాన్ని సొంతం చేసుకుంది. ఇప్పుడీ మూవీ ఆగస్ట్ 9న తెలుగులో గ్రాండ్ రిలీజ్ సిద్ధమైంది. విజయ్ సేతుపతిలోని విలక్షణతను చాటిన ఈ సినిమా తమిళ ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది. విజయ్ సేతుపతి ఈ సినిమాలో స్పెషల్ లేడీ క్యారెక్టర్ రోల్‌లో నటించారు. ఆయన చేసిన పాత్రకుగానూ ఎన్నో అవార్డ్స్ అందుకున్నారు. ఫహద్ ఫాసిల్, సమంత, రమ్యకృష్ణ పాత్రలు ఈ సినిమాకు మరో ప్రత్యేక ఆకర్షణ. యువన్ శంకర్ రాజా మ్యూజిక్ అందించారు. నాలుగు విభిన్న కథలను జోడించి చిత్రీకరించిన ఈ చిత్రం ఎన్నో అవార్డులను, క్రిటిక్స్ నుంచి అద్భుతమైన రెస్పాన్స్ అందుకుంది. తమిళంలో బ్లాక్ బస్టర్ హిట్‌గా నిలిచిన సూపర్ డీలక్స్ సినిమా ఇప్పుడు తెలుగులోనూ ఘన విజయం సాధిస్తుందని మేకర్స్ భావిస్తున్నారు. ఆగస్ట్ 9న టాలీవుడ్‌లో పలు సినిమాలు రిలీజ్‌కు ఉన్నప్పటికీ.. 400కి పైగా థియేటర్లలో ఈ సినిమాను విడుదల చేయబోతున్నట్లుగా మేకర్స్ అధికారికంగా ప్రకటించారు.

## రాజ్‌తో రిలేషన్‌షిప్...

### త్వరలోనే పెళ్లి

'ధూత'వెబ్ సిరీస్‌తో తెలుగు ప్రేక్షకులకు చేరువైన నటి ప్రియా భవానీ శంకర్ తాజాగా తన పెళ్లి గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. రాజ్ అనే వ్యక్తితో తాను దాదాపు పదేళ్ల నుంచి రిలేషన్‌లో ఉన్నానని తెలిపారు. వివాహ బంధంలోకి అడుగుపెట్టాలని ఎప్పటినుంచో అనుకుంటున్నామని.. వచ్చే ఏడాది తప్పకుండా పెళ్లి చేసుకుంటామన్నారు. సినీ పరిశ్రమలోకి రాక ముందునుంచే రాజ్‌తో నేను ప్రేమలో ఉన్నా. మేమిద్దరం విడిపోయామంటూ ఇప్పటికే ఎన్నోసార్లు వార్తలు వచ్చాయి. వాటిని పెద్దగా పట్టించుకోలేదు. ఇప్పటివరకూ నేను చాలామంది నటులతో కలిసి వర్క్ చేశా. వారితో ఉన్న స్నేహం కారణంగా.. పుట్టినరోజు, లేదా ఏదైనా స్పెషల్ డే వచ్చినప్పుడు వారికి విషెస్ చెబుతూ సోషల్‌మీడియాలో పోస్ట్ పెట్టేదాన్ని. అలా, పెట్టడమే ఆలస్యం.. వారితో నేను రిలేషన్‌లో ఉన్నానంటూ వార్తలు వచ్చేవి. అదృష్టంకొద్దీ ఇప్పుడు ఆ తారలకు పెళ్లి కూడా అయింది అని ఆమె నవ్వుతూ చెప్పారు. చెన్నైకు చెందిన ప్రియా భవానీశంకర్.. 'మేయాద మాన్'తో నటిగా తెరంగేట్రం చేశారు. 2023లో విడుదలైన 'కళ్యాణం కమనీయం'తో ఆమె తెలుగులోకి ఎంట్రీ ఇచ్చారు. సంతోష్ శోభన్ హీరోగా నటించిన ఆ సినిమా మిశ్రమ స్పందనలకే పరిమితమైంది. అనంతరం ఆమె 'ధూత'లో నాగచైతన్య సతీమణిగా కనిపించి ప్రేక్షకులను అలరించారు.



# కార్పొరేట్ కంపెనీలు గ్రామాలకు తరలండి

**ఒక్కో గ్రామాన్ని దత్తత తీసుకోవాలి**

**పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క**

**సంసిద్ధత వ్యక్తం చేసిన దిగ్గజ ఐటీ కంపెనీలు**



**వరంగల్ వాయిస్, ములుగు :** వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి కార్పొరేట్ కంపెనీలు తమ వంతు సహకారం అందించాలని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క పిలుపునిచ్చారు. చివరి వరుసలో ఉన్న వారి అభివృద్ధి కోసం సామాజిక బాధ్యతగా కంపెనీలు ముందుకు రావాలని కోరారు. ఒక్కో కార్పొరేట్ కంపెనీ..ఒక్కో గ్రామాన్ని దత్తత తీసుకుని అభివృద్ధికి బాటలు వేయాలని సూచించారు. హైదరాబాద్ లోని ప్రజా భవన్ లో మంత్రి సీతక్క, సెర్ప్ సీఈఓ దివ్యా దేవరాజన్, ములుగు కలెక్టర్ దివాకర్ లతో ఐటీ దిగ్గజ కంపెనీలైన మైక్రోసాఫ్ట్, ఇన్ఫోసిస్, కాగ్నిజెంట్, క్వాల్కమ్, బోష్, గ్రాన్యుల్స్ ఇండియా, టీసీఎస్, ఉషా, నిర్మాన్ తదితర కంపెనీల ప్రతినిధులతో బుధవారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. మనతో పాటు చుట్టూ ఉన్న వాళ్లు సంతోషంగా ఉండాలన్న లక్ష్యంతో కార్పొరేట్ కంపెనీలు పని చేస్తే సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. కార్పొరేట్ కంపెనీలు ఒక్కో గ్రామాన్ని దత్తత తీసుకొని స్థానిక సమస్యలను పరిష్కరించడంతో పాటు ఉపాధి అవకాశాలను మెరుగుపరిచేలా స్కిల్ డెవలప్ మెంట్ కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. ఆదిలాబాద్, ములుగు వంటి ప్రాంతాల్లో ఇప్పటికే కార్పొరేట్ కంపెనీలు కొన్ని గ్రామాలను దత్తత తీసుకొని మార్పు చేసి చూపించాయని మంత్రి గుర్తు చేశారు. విద్య, వైద్యం, ఉపాధి, పారిశుద్ధ్య నిర్వహణ, మంచినీరు, మౌలిక సదుపాయాల కల్పన వంటి అంశాల్లో చేయూతనిచ్చేలా కంపెనీలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ప్రజలకు సహాయం చేస్తే గుండెల్లో పెట్టి చూసుకుంటారని పేర్కొన్నారు. ప్రజాసేవలో సంతృప్తి పొందిన వారే అసలైన శ్రీమంతులని తెలిపారు. ములుగు జిల్లాల్లో నెలకొన్న పరిస్థితులను, అవసరాలను, ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను కలెక్టర్ దివాకర్ వివరించారు. మంత్రి పిలుపుమేరకు ములుగు వంటి నియోజకవర్గాల్లో సీఎస్ఆర్ నిధులను వెచ్చించేందుకు, అభివృద్ధి కార్యక్రమాల్లో పాలుపంచుకునేందుకు కంపెనీలు ముందుకు వచ్చాయి. ఆయా కంపెనీలను మంత్రి సీతక్క అభినందించారు.



# ప్రజలంతా సుభిక్షంగా ఉండాలి

## మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్

## ఘనంగా పోచమ్మ బోనాలు

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** గ్రామ దేవతల దీవెనలతో ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని మాజీ చీఫ్ విప్, బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. నగరంలోని 54 వ డివిజన్ పోచమ్మ కుంటలోని కుమ్మరి సంఘం ఆధ్వర్యంలో బుధవారం పోచమ్మ బోనాల కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించారు. పెద్ద మొత్తంలో హాజరైన మహిళలు బొనం నెత్తిన పెట్టుకొని డప్పుచప్పుల్లతో నృత్యం చేస్తూ ముందుకు సాగారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా దాస్యం వినయ్ భాస్కర్ హాజరై మొక్కులు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా పోచమ్మ, మైసమ్మ, పెద్దమ్మ తల్లుల చల్లని చూపులు భక్తులపై ఉండాలని, ప్రజలందరూ సుఖశాంతులతో, పిల్లాపాపలతో, అష్టైశ్వర్యాలతో ఆనందంగా జీవించాలని అమ్మవారిని వేడుకున్నట్లు వినయ్ భాస్కర్ ప్రకటించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ సోదా కిరణ్, సంఘం సభ్యులు కందికొండ వేణుగోపాల్, అశోక్, శ్రీను, సదానందం, జనార్దన్, కొమురయ్య, శ్రీధర్, బీఆర్ఎస్ నాయకులు నరెడ్ల శ్రీధర్, కేశోజు ప్రణయ్ తదితరులు పాల్గొన్నారు.



# తూర్పు తెలుగు దినపత్రికల జర్నలిస్ట్ సంఘం ఏర్పాటు

**కన్వీనర్‌గా అలువాల సదాశివుడు నియామకం**

**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** వరంగల్ తూర్పు నియోజకవర్గం పరిధిలో వివిధ తెలుగు దినపత్రికల్లో పనిచేస్తున్న వర్కింగ్ జర్నలిస్టులు బుధవారం నూతన సంఘంను ఏర్పాటు చేసుకున్నారు. శివనగర్ లోని సాయి కన్వెన్షన్ హాల్‌లో వరంగల్ తూర్పు తెలుగు దినపత్రికల జర్నలిస్టులంతా సమావేశమై ఈ మేరకు అడహాక్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ కన్వీనర్‌గా సీనియర్ జర్నలిస్ట్ అలువాల సదాశివుడిని నియమించారు. కో కన్వీనర్లుగా కొత్త రమేష్, బజ్జూరి ప్రభాకర్, కర్పనస్వామి చిన్నబాబు, మైదం వెంకన్న, బాదావత్ బాలాజీ, ఈద శ్రీనాథ్, ఈర్ల సురేందర్, మేరుగు ఆశోక్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్బంగా పలువురు జర్నలిస్టులు మాట్లాడుతూ సోషల్ మీడియాలో వస్తున్న పోస్టింగ్‌ల వల్ల ఎదురవుతున్న సమస్యలపై చర్చించారు. అదే విధంగా తెలుగు దినపత్రికల జర్నలిస్టులకు డబుల్ బెడ్‌రూంల మంజూరు కోసం అధికార పార్టీ నేతలను, ప్రభుత్వ పాలన యంత్రాంగాన్ని కలిసి పరిష్కరించేందుకు కృషి చేస్తుందని తెలిపారు. ఈ సమావేశంలో వి.రాంచందర్, బి.శ్రీనివాస్, ఎం.రాజేంద్రప్రసాద్, బి.వెంకటేశ్వర్లు, వి.శ్రీనివాస్, కె.రమేష్, టి.నరేష్, ఆర్.ఉపేందర్, ఎండి.జాఫర్, పి.వేణు, కె.భరత్, బి.కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# వాగ్దేవిలో ఇంటర్న్‌షిప్ అవగాహన సదస్సు




**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** వరంగల్ లోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ ఇనిస్టిట్యూట్ సీమెన్స్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ సహకారంతో బుధవారం బొల్లికుంటలోని వాగ్దేవి కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాలలో ఈసీఈ, త్రిపుల్ ఈ, మెకానికల్ ఇంజినీరింగ్ విద్యార్థుల కోసం డిజిటల్ మాన్యుఫ్యాక్చరింగ్, ఆటోమేషన్‌పై ఇంటర్న్‌షిప్ అవగాహన సదస్సు నిర్వహించారు. సీమెన్స్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ హెడ్ వై.యస్మీన్ మిర్జా మాట్లాడుతూ పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా అత్యాధునిక మౌలిక సదుపాయాలు, ప్లేస్‌మెంట్ అవకాశాలను అందించామన్నారు. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, వరంగల్‌తో ఇప్పటికే ఉన్న ఎంవోయూ ప్రకారం ఎన్‌ఐటీ వరంగల్ సీమెన్స్ సౌకర్యాలను ఉపయోగించి రీసెర్చ్ ఓరియెంటెడ్, ఇండస్ట్రీ ఆధారిత రియల్ టైమ్ ప్రాజెక్టులు జరుగుతున్నాయని రీసెర్చ్ అండ్ ఇండస్ట్రీ ఇన్‌స్టిట్యూట్ ఇంటరాక్షన్స్ అసోసియేట్ డీన్ డాక్టర్ రాజు చింతకింది తెలిపారు. ఈ సెమినార్‌లో పరిశ్రమ నిపుణులు ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్ విద్యార్థుల కోసం ఇటీవల అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్‌లను అందించారు. ఈ సెమినార్‌లో ఈసీఈ విభాగాధిపతి, అడ్మినిస్ట్రేషన్ డీన్ డాక్టర్ ఎం.శశిధర్, మెకానికల్ ఇంజినీరింగ్ హెచ్ఓడి డాక్టర్ పి.శ్రీనివాసులు నిపుణులను సన్మానించగా, సెమినార్ కోఆర్డినేటర్లు డాక్టర్ జి.కోటేశ్వర్ రావు, ఎండీ రుక్సానాబేగం, కె.బాలకృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

# చేనేతను ప్రోత్సహిద్దాం నేతన్నలను ఆదుకుందాం : వరంగల్ కలెక్టర్



**వరంగల్ వాయిస్, వరంగల్ :** జాతీయ చేనేత దినోత్సవం స్ఫూర్తితో చేనేతను ప్రోత్సహించి నేతన్నలను ఆదుకుందామని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా అన్నారు. బుధవారం జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక కాళోజీ సెంటర్ నుంచి జిల్లా పరిషత్తు కార్యాలయం వరకు నిర్వహించిన ర్యాలీలో చేనేత కార్మికులతో కలిసి ఆమె పాల్గొన్నారు. అనంతరం జిల్లా పరిషత్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన చేనేత ఉత్పత్తుల స్టాల్ ను సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్తు సమావేశ మందిరంలో చేనేత కార్మికులతో జరిగిన సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ చేనేత దినోత్సవాన్ని ఉత్సాహంగా, అంకితభావంతో జరుపుకోవడమే కాకుండా చేనేత వస్త్రాలు కొనుగోలు ద్వారా కార్మికులకు అండగా నిలవాలన్నారు. చేనేత పరిశ్రమ యొక్క ప్రాముఖ్యత గురించి ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని స్థానిక చేనేత కార్మికులు, చేతివృత్తులదారులు ఆర్థికంగా బల్పడేందుకు ఉత్పత్తులను విరివిగా కొనుగోలు చేయాలని ఈ సందర్భంగా కలెక్టర్ కోరారు. కొండ లక్ష్మణ్ బాపూజి రాష్ట్ర స్థాయి అవార్డు కు జిల్లా నుంచి ఎంపికైన ఆడెపు శ్రీనివాస్, సదానందం కొత్తవాడ నుంచి ఎంపిక కావడం అభినందనీయమన్నారు. జిల్లా నుంచి ఎంపికైన 30 మంది స్కిల్ డెవలప్డ్ వీవర్స్ ను కలెక్టర్ సన్మానించారు.

### తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరం..

బుధవారం తల్లిపాల వారోత్సవాల ముగింపు సందర్భంగా వరంగల్ లోని సీకేఎం ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రిలో జిల్లా సంక్షేమ శాఖ, జాతీయ ఆయుష్ మిషన్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ శిశువు పుట్టిన గంటలోనే తల్లికి ముర్రు పాలు వస్తాయని వాటిని శిశువుకు పట్టిస్తే చిన్నారుల్లో రోగనిరోధక శక్తి పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంఘక్షేమ అధికారి హైమవతి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ, ప్రాజెక్టు సీడీపీఓ విద్య, సూపర్వైజర్లు బత్తిని రమాదేవి, వెంకటేశ్వరి, ఆశ, ఛాయా, కళ్యాణి, రమా, మాధవి లావణ్య , పద్మావతి, డిసి కార్తీక్, బిసి జోష్నా, ఏఎన్ఎం, అంగన్వాడి టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DIST DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com